క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



మల్యాల: ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అందజేస్తున్న సైకిళ్లను సోమవారం తక్కళ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈవో జయసింహారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాయకులు బింగి వేణు, గాజుల మల్లేశం, సంగని రవి, కందుల వినోద్, కొక్కెర మల్లేశంయాదవ్, లక్ష్మారెడ్డి, మారుతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆత్మకూర్ రూట్‌లో బస్సులు

మెట్‌పల్లి రూరల్: ఆత్మకూర్ రూట్‌కు మంగళవారం నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తాయని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ తెలిపారు. జగ్గాసాగర్‌లో ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణ పనులు జరగడంతో కొన్ని రోజులుగా రామలచ్చక్కపేట, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోయాయి.

మీనాక్షి నటరాజన్‌కు వినతి

జగిత్యాలరూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు నాయకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరికతో పార్టీ కార్యకర్తల పరిస్థితి దయనీయంగా మారిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుద్ధరణ, బలోపేతం కోసం ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలం కష్టాలు, హింసలు, అణచివేతలు ఎదుర్కొని పని చేశామన్నారు. జున్ను రాజేందర్, గాజంగి నందన్న తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ తహసీల్దార్‌గా నాగార్జున

రాయికల్: రాయికల్ తహసీల్దార్‌గా నాగార్జున మంగళవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఉదయ్‌కుమార్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా వెళ్లనున్నారు.

ఆర్థిక సాయం

రాయికల్: బీజేపీ వస్తాపూర్ బూత్ అధ్యక్షుడు సంజీవ్ ఇటీవల మృతిచెందగా.. సోమవారం ధర్మపురి అరవింద్ రూ.లక్ష చెక్కును బూత్ కార్యకర్త నిధుల నుంచి అందజేశారు. మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్, పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, నాయకులు సాయిరాజ్‌గౌడ్, భూమేశ్, మహేశ్, మచ్చ నారాయణ, తిరుపతి, రాము, జగన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించాలి



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: ప్లాస్టిక్‌ను నివారించాలని, ప్రతీ ఒక్కరు స్వచ్ఛభారత్‌లో పాల్గొనాలని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. విద్యార్థులు నూకపల్లిలోని అర్బన్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు విద్యార్థులకు తడి, పొడి చెత్తపై వివరించారు. కమిషనర్ స్పందన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సన్మానం

కొడిమ్యాల: తిప్పాయపల్లె ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ హెచ్ఎంగా వచ్చిన సాంబమూర్తిని ఎంఈవో శ్రీనివాస్ సన్మానించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, మండల అధ్యక్షుడు ముల్క శ్రీనివాస్, అంజయ్య, రాజేశం, విజయేంద్ర, ఏనుగు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కొడిమ్యాల: మండల కేంద్రానికి చెందిన నాంపల్లి శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అతడు బ్యాంకులో సంవత్సరానికి రూ.436 బీమా చేయగా.. ప్రభుత్వం నుంచి రూ.2లక్షల బీమా వర్తించింది. చెక్కును నామిని అయిన అతడి అన్న రవికి సోమవారం యూనియన్ బ్యాంక్ కొడిమ్యాల బ్రాంచ్ మేనేజర్ సంజీవ్‌కుమార్ అందించారు.

పచ్చదనాన్ని కాపాడాలి



గ్రీన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: ప్రతీ ఒక్కరు పచ్చదనాన్ని కాపాడాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులందరూ సృజనాత్మకంగా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీ అర్వింద్ జన్మదినం పురస్కరించుకొని అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోరుట్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో బీజేపీ కార్యకర్త నిముషకవి నవీన్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.15వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు అందించారు.

వినియోగం పెరిగినా.. సబ్ స్టేషన్లు లేవు

- ఓవర్ లోడ్ సమస్యతో వినియోగదారుల ఇబ్బందులు
- సరఫరా కంటే అధికంగా వినియోగం
- కొత్తవి ఏర్పాటు చేయాలని రైతుల వినతి



భూషణరావుపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

కథలాపూర్: ఒకప్పుడు బల్బులు వెలిగేందుకు విద్యుత్ అవసరం అనే పరిస్థితుల నుంచి ఎలక్ట్రికల్ వస్తువుల వినియోగం విరివిగా ఉండడంతో ఒక్క నిమిషం కూడా విద్యుత్ లేకుంటే ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న రోజులివి. గృహాలకే కాకుండా పరిశ్రమలు, వ్యవసాయం కోసం విద్యుత్ వినియోగదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా.. విద్యుత్ సబ్ స్టేషన్ల సంఖ్య పెరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు. ఓవర్ లోడ్‌తో సతమతమవుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. వినియోగం బట్టి కథలాపూర్ మండలంలో అదనంగా విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

మండలంలో 19 గ్రామాలు.. 7 సబ్ స్టేషన్లు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. ట్రాన్స్‌కో అధికారులు మండలాన్ని కథలాపూర్, అంబారిపేట సెక్షన్లుగా విభజించారు. కథలాపూర్ సెక్షన్ పరిధిలో కథలాపూర్, భూషణరావుపేట, బొమ్మెన, చింతకుంట గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లున్నాయి. అంబారిపేట సెక్షన్ పరిధిలో అంబారిపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో సబ్ స్టేషన్లున్నాయి. ఈ సబ్ స్టేషన్ల నుంచి ఆయా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.

సబ్ స్టేషన్లు అవసరమున్న గ్రామాలివే..

మండలంలోని అంబారిపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 5 గ్రామాలుండగా... 1,920 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, 2,920 గృహాల కనెక్షన్లున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇప్పపెల్లి, పోతారం గ్రామాలకు కలిపి ఒక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ అవసరమని ప్రజలు పేర్కొంటున్నారు. భూషణరావుపేట సబ్ స్టేషన్ పరిధిలో 3 గ్రామాలుండగా... 1,640 వ్యవసాయ కనెక్షన్లు, 1,931 గృహాల కనెక్షన్లున్నాయి. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని పెగ్గెర్ల గ్రామంలో వ్యవసాయ కనెక్షన్లు అధికంగా ఉండడంతో ఇక్కడ కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ అవసరమంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఓవర్ లోడ్ సమస్య తీర్చాలి



భూషణరావుపేట విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పెగ్గెర్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. వరద కాలువ వల్ల భూగర్భజలాలు పెరిగాయి. కాలువకు మోటార్లు అమర్చుకోవడం, బోరుబావులకు మోటార్లు అమర్చుకోవడం వల్ల పెగ్గెర్ల శివారులో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. ఓవర్ లోడ్ సమస్య ఏర్పడుతోంది. పెగ్గెర్లలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తేనే విద్యుత్ సమస్య తీరుతుంది.

– చెల్లపెల్లి అంజయ్య, రైతు, పెగ్గెర్ల

సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



అంబారిపేట సబ్ స్టేషన్ నుంచి ఇప్పపెల్లి, పోతారం గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ 2 గ్రామాల్లో వ్యవసాయ, గృహాల విద్యుత్ కనెక్షన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. రోజురోజుకి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కొత్త విద్యుత్ కనెక్షన్లు అవసరమవుతాయి. పోతారం, ఇప్పపెల్లి గ్రామాలకు కలిపి కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి. అప్పుడే నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

– లోక్యనాయక్, రైతు, పోతారం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యపై ఆయా గ్రామాల్లో పర్యటించి వివరాలు తెలుసుకుంటాం. మండలంలో కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసే విషయమై గ్రామాల్లో శాఖాపరంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

– బొప్పరాతి రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల



పెగడపల్లి: దోమల నియంత్రణకు గత ప్రభుత్వం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు మండలంలోని అన్ని పంచాయతీల్లో మూలన పడ్డాయి. ప్రస్తుతం దోమల వ్యాప్తి అధికంగా ఉన్నా.. యంత్రాలు పని చేయకపోవడంతో ఏ ఒక్క గ్రామంలో ఫాగింగ్ చేయడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల వ్యాప్తి అధికమైందని, ఫాగింగ్ చేసి దోమల వ్యాప్తిని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, పెగడపల్లి, సెల్ నంబర్: 9281481659



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643



మల్లాపూర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

రైతుల గోడు పట్టదా..

మల్లాపూర్: రైతుల గోడు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. పోలీసులు నాయకులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా మాజీ సభ్యుడు మల్లయ్య, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల కమీషన్ విడుదల చేయాలి



మల్యాల: తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న డీలర్లు

మల్యాల: మండలంలోని చౌక ధరల దుకాణాల డీలర్లు కమీషన్ విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ వసంతకు వినతిపత్రం సమర్పించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు చెల్లించకపోవడంతో దుకాణాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. మల్యాల ఈశ్వర్, గడ్డం రమేశ్, తరాల తిరుపతి, వీరబత్తిని విష్ణుమూర్తి, కొక్కునూరి శంకరయ్య, ముప్పారపు రాంచంద్రం, చెలుమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల రేషన్ డీలర్లకు కమీషన్ వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు డీలర్లు వినతిపత్రం అందజేశారు. జి.నర్సయ్య, మోహన్, కిరణ్, డి.నర్సయ్య, అనురాధ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: తమకు రావాల్సిన కమీషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ రేషన్ డీలర్లు ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తేలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్‌లో మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. చిన్నయ్య, ముంజ జలంధర్, పరమేశ్వర్, సత్తయ్య, శ్రీనివాస్, మారుతి, శకుంతల, ప్రసాద్, గంగాధర్, రాజేశ్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే విడుదల చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సపురం రవీందర్, విజయ్, బుర్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డీలర్లకు కమీషన్ డబ్బులు విడుదల చేయాలని ఎంపీడీవో రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కొడిమ్యాల: మండలంలోని రేషన్ డీలర్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

వెల్గటూర్: గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే చెల్లించేలా ప్రభుత్వానికి నివేదించాలని తాజా మాజీ సర్పంచులు సోమవారం ఎండపల్లి ఎంపీడీవో నరేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. మారం జలంధర్‌రెడ్డి, కొమ్ము రాంబాబు, మెతుకు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకే మట్టి వినాయక ప్రతిమలు



మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కథలాపూర్: పర్యావరణ పరిరక్షణకే మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులతో తయారు చేయించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులు చెరువులో నుంచి మట్టిని తీసుకొచ్చి స్కూల్‌లో వినాయకుడి ప్రతిమలను తయారు చేశారు. ఉపాధ్యాయులు రవికుమార్, మహేశ్, రాజు, విజయ్, ప్రమీల, సుజాత, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు



యువకులతో అధికారులు

మేడిపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్ క్రాసింగ్ విద్యుత్ లైన్లున్న ప్రాంతాల్లో ఎత్తుగా ఉండేలా 16 సమస్యాత్మక ప్రాంతాల్లో 11 మీటర్ పోల్‌లు అమర్చారు. మండల కేంద్రం గుండా జాతీయ రహదారి వెళ్తుండడంతో విద్యుత్ తీగలు కిందికున్న ప్రాంతాలను గుర్తించి 11 మీటర్ పోల్స్ వేసినట్లు మండల విద్యుత్ అధికారి అర్జున్ తెలిపారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం, మెట్‌పల్లి డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్, టెక్నికల్ సేఫ్టీ ఆఫీసర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. సీఐ నీలం రవి మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కథలాపూర్: కథలాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహేశ్‌కుమార్ వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, సత్యం, మహేశ్, ప్రవీణ్, ప్రమోద్, లింగం, సునీల్, శ్రీకర్, శాంతారాం, సాయిరెడ్డి పాల్గొన్నారు.

మేడిపల్లి: బండి సంజయ్‌పై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో మేడిపల్లి, భీమారం మండలాల బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. మేడిపల్లి మండల అధ్యక్షుడు చిట్యాల సురేశ్, భీమారం మండల అధ్యక్షుడు నాగం శివకుమార్, గోస్కి మధు, ఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంస పత్రం అందజేస్తున్న పీఈటీ వెంకటలక్ష్మి

జగిత్యాలరూరల్: చల్‌గల్ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన కౌశిక్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. ఈనెల 21న జగిత్యాల మినీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 ట్రయాతలిన్ క్రీడల్లో ప్రతిభ కనబర్చాడన్నారు. ఈనెల 31న మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్: వేంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు నాగరాజకుమారి తెలిపారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరుట్ల మండలం నలంద ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. చుక్కబొట్ల హేమచంద్ర, శ్రీరాముల కార్తికేయ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

9 నుంచి క్రీడాపోటీలు

గొల్లపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అక్టోబర్ 9, 10, 11ల్లో నిర్వహించే మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి చెరుకు రాజన్న తెలిపారు. అండర్–14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9396614777 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రీడాసమాఖ్య మండల కార్యదర్శిగా తిరుమలేశ్

మేడిపల్లి: పాఠశాలల క్రీడాసమాఖ్య భీమారం మండల కార్యదర్శిగా పెసరి తిరుమలేశ్‌ను నియమిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి కె.రాము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యంత కీలకం ప్రాథమిక విద్య



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఇబ్రహీంపట్నం: ప్రాథమిక విద్య ప్రతీ వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైందని, అది ఉంటేనే నేటి ఆధునిక సమాజంలో మనిషి మనుగడ సుఖంగా సాగుతుందని ఎంఈవో మధు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి ఉల్లాస్ శిక్షణను నిర్వహించారు. ఎన్ఈపీ 2020 ప్రకారం సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఐకేపీ ఏపీఎం శంకర్, రిసోర్స్‌పర్సన్లు శివకుమార్, రఘునాథ్, మండలంలోని ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.

మల్లాపూర్: సంపూర్ణ అక్షరాస్యతే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని, వంద శాతం అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ తోడ్పడుతుందని మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల ఉపాధ్యాయులు, సెర్ప్ సీసీ, సీఏలకు నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఐకేపీ ఏపీఎం రమేశ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు తేజశ్విని, ఐకేపీ సీసీలు లక్ష్మీరాజం, రాజు, రమేశ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

గుట్ట నుంచి మొరం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్: చెర్లకొండాపూర్ శివారులోని కుందెలు గుట్టను మైనింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. గుట్ట నుంచి అనుమతులకు మించి మొరం తవ్వకాలు చేపడుతున్నారనే సమాచారంతో ఆ ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు తవ్వకాలను నిలిపివేయించారు. ఆ ప్రాంతంలో ఈత చెట్లు నాటాలని నిర్ణయించడంతో.. మొరం తవ్వకాలకు 10 రోజులపాటు అనుమతులిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: కలిగోట గ్రామ శివారులోని సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. సూరమ్మ ప్రాజెక్టు, కాలువల పనులు త్వరగా పూర్తయితే 2 మండలాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, బీజేవైఎం మండలాధ్యక్షుడు ఆరె శివ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, జీవన్‌రెడ్డి, ప్రతాప్, ప్రమోద్, లింగం, రాజం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో మేలు



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న జువ్వాడి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుట్ల: ఉచిత వైద్యశిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం కోరుట్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కోరుట్ల ఐఎంఏ, రెనే ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో టైఫాయిడ్, డెంగీ, మలేరియా, విష జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, సంగ లింగం, ఐఎంఏ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అనూప్‌రావు, కోరుట్ల ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు రేగొండ రాజేశ్, జగదీశ్వర్, వైద్యులు స్వాతి అనూప్‌రావు, గీతా ఇంద్రనీల్, అన్వేశ్, షేక్ సమీర్, సంతోష్, ఎస్సై చిరంజీవి, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ఆకుల మల్లికార్జున్, సీనియర్ జర్నలిస్టు రాంగోపాల్, రామకృష్ణ, సలీం ఫారుఖీ, చావ్లా నవీన్, శ్రీనివాస్, రాజేందర్, సాజిత్, సాయి, రమణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, గజం శంకర్, ముసావీర్, చిరంజీవి, మొహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

రాయికల్: ఇటిక్యాల గ్రామంలో వైఎస్సార్ శాఖ, కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నానో యూరియా వాడకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఏవో ముక్తేశ్వర్ మాట్లాడుతూ.. పంట ఎదుగుదలకు యూరియా అధిక మొత్తంలో వాడితే జరిగే పర్యావరణ కాలుష్యంపై వివరించారు. సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, సామల్ల వేణు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: రైతులు నానో యూరియా వాడకం వైపు మొగ్గు చూపించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. అమ్మక్కపేట, డబ్బా, ఎర్దండి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, ఏఈవోలు వినోద్, రవళిక తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: నానో యూరియా వాడకంతో ఖర్చు తగ్గి పంటల దిగుబడి పెరుగుతుందని ఏవో శ్రీకాంత్ అన్నారు. ల్యాగలమర్రి గ్రామంలో నానో యూరియా వాడకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు.